
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.2; కనిష్ఠం 17.4
కామారెడ్డి జిల్లా వార్తలు
5
బుధవారం 3 జనవరి 2024

రేపటి నుంచి డీఎడ్ పరీక్షలు

కామారెడ్డి టౌన్, జనవరి 2: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ మొదటి సంవత్సర పరీక్షలు ఈనెల 4 నుంచి 10 వరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు డీఈవో రాజు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని హాల్ టికెట్ డౌన్‌లోడ్, ఇతర ఏమైన సందేహాల కోసం బీఎస్ఈ.తెలంగాణ. జీవోవి. ఇన్ వెబ్‌సైట్‌ని సందర్శించాలని, పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందుగానే చేరుకోవాలని ఆయన తెలిపారు.



ప్రధాన పార్టీలకు సవాళ్లే!

కామారెడ్డి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లకు పార్లమెంట్ ఎన్నికలు సవాళ్లుగా మారనున్నాయి. ఆ తర్వాత జరిగే పంచాయతీ ఎన్నికలను కూడా ఈ పార్టీలు ఎదుర్కోనున్నాయి. అనంతరం స్థానిక సంస్థలైన జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికలు సైతం జరగనున్నాయి. మొత్తానికి ఈ సంవత్సరం మొత్తం ఎన్నికల సందడితోనే రాజకీయ పార్టీలు గడపనున్నాయి. గత సంవత్సరం బీఆర్ఎస్, బీజేపీలకు చేదు అనుభవాన్ని మిగిల్చగా కాంగ్రెస్‌కు తీపి జ్ఞాపకాన్ని కల్పించింది. ఆ పార్టీ జిల్లాలో మొత్తం నాలుగు నియోజకవర్గాల్లో రెండు చోట్ల గెలువగా ఒక్కో చోట బీఆర్ఎస్, బీజే పీలు సరి పెట్టుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో కొత్త సంవత్సరంలో పార్లమెంట్ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకం కానుండగా బీఆర్ఎస్, బీజేపీలకు సవాల్‌గా మారనున్నాయి. జిల్లాలోని జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలుచుకోవాలనే ధీమాతో ఈ ప్రధాన మూడు పార్టీలు ఉన్నాయి.

వ్యూహాత్మకంగా ముందుకు పోతున్న ప్రధాన పార్టీలు

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలు సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాలు రానున్నాయి. పార్లమెంట్ ఎన్నికలే గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు తమ రాజకీయ వ్యూహాలకు అప్పుడే పదును పెట్టడం మొదలుపెట్టాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఆచీతూచి అడుగులు వేస్తున్నాయి. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఎంపీ ఎన్నికల్లోనూ పైచేయి సాధించాలని ఇప్పటికే జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి ఇన్‌చార్జీను నియమించింది. ఈ లోక్‌సభ స్థానానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఇన్‌చార్జీగా నియమితులయ్యారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ కూడా మాజీ మంత్రులు ఎమ్మెల్యేలకు పార్టీ ఇన్‌చార్జీలకు ఇటీవల దిశా నిర్దేశం చేసింది. బీజేపీ కేంద్ర మంత్రులను ఇన్‌చార్జీలుగా నియమించే పనిలో పడింది.

- రాజకీయ పార్టీల ముందున్న పార్లమెంట్, పంచాయతీ ఎన్నికలు
- కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకం
- బీఆర్ఎస్, బీజేపీలకు సవాళ్లు
- అసెంబ్లీ ఎన్నికలతో మారిన పార్టీ బలాబలాలు
- గెలుపు జోష్‌లో ఉన్న కాంగ్రెస్
- వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న బీజేపీ
- పావులు కదుపుతున్న బీఆర్ఎస్

అభ్యర్థుల కోసం కసరత్తు

జహీరాబాద్ పార్లమెంట్ స్థానం ప్రస్తుతం బీఆర్ఎస్ చేతుల్లోనే ఉంది. ఎంపీగా బీబీ పాటిల్ కొనసాగుతున్నారు. ఈయన రెండు పర్యాయాలుగా ఆ పార్టీ నుంచే ఎంపీగా గెలుపొందారు. పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నందున జహీరాబాద్ అభ్యర్థులుగా ఎవరిని నియమించాలనే విషయంలో ప్రధాన పార్టీలు పరిశీలనను చేస్తున్నాయి. గెలిచే సత్తా కలిగిన అభ్యర్థుల కోసం కసరత్తు చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలకే తిరిగి టికెట్ ఇస్తుందా లేక కొత్త వారిని ఎంపిక చేస్తుందా అనే చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇచ్చి చేతులు కాల్చుకున్న బీఆర్ఎస్ ఈ సారి ఆ పని చేయకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కొత్త వారికే టికెట్ ఇచ్చే అవకాశాలు లేకపోలేదని ఆ పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇక కాంగ్రెస్ కూడా అభ్యర్థుల ఎంపికలో ఆచీతూచి అడుగులు వేయనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో అనుసరించిన వ్యూహాలనే ఈ ఎన్నికల్లోనూ అనుసరించనుంది. అన్ని వర్గాల ఓటర్లను ప్రభావితం చేయగల అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తోంది. ఇతర పార్టీలో గెలిచే సత్తాకలిగిన నేతలకు గాలం వేస్తున్నట్లు తెలుస్తోంది. బీజేపీ కూడా అభ్యర్థుల ఎంపికకు కసరత్తు ప్రారంభించింది. బీజేపీలోనే టికెట్లకై పలువురు ఆశావహుల మధ్య తీవ్ర పోటీ నెలకొంటుంది. జహీరాబాద్ ఎంపీ టికెట్ కోసం బీజేపీ నుంచి వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి, పైడి ఎల్లారెడ్డి, మేడపాటి ప్రకాష్‌రెడ్డి, సోమాయప్పతో పాటు మరో ముగ్గురు నేతలు పార్లమెంట్ టికెట్ కోసం పోటీ పడుతున్నట్లు సమాచారం.

త్వరలోనే నోటిఫికేషన్

పార్లమెంట్ ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ రానున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం సైతం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా యంత్రాంగం సైతం ఎన్నికలకు కసరత్తు ప్రారంభించింది. ప్రధాన పార్టీలు అభ్యర్థుల వేటలో పడ్డాయి. ఈ నేపథ్యంలో త్వరలోనే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాతే పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. వాస్తవానికి ప్రస్తుత గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే జనవరి చివరి వారంలో కానీ ఫిబ్రవరి మొదటి వారంలో గాని పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జహీరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో 16.13 లక్షల మంది ఓటర్లు

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 7 అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 16,13,176 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులవి 7,90,115 మంది ఓటర్లు ఉండగా మహిళలవి 8,23,272 మంది ఓటర్లు ఉండగా ఇతరులవి 57 ఉన్నాయి. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,036 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఉంది. ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోకి కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ, జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కామారెడ్డి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,52,460 ఉండగా పోలింగ్ కేంద్రాలు 266 ఉన్నాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,20,531 ఉండగా 270 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. జుక్కల్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,99,962 ఉండగా 255 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. బాన్సువాడ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,92,841 ఉన్నాయి. జహీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,70,785 ఉండగా 314 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నారాయణఖేడ్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,31,188 ఉండగా 296 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆందోల్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,45,409 ఉండగా 313 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

పార్లమెంట్ ఎన్నికలకు సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



బస్వాపూర్‌లో కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న గ్రామస్థులు

కామారెడ్డి టౌన్, జనవరి 2: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుటలో అధికారులు, సిబ్బంది సేవలు ప్రశంసనీయమని పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించేందుకు సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా అన్ని రంగాల్లో మరింత పురోభివృద్ధి సాధించుటలో తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. అర్హులైన పేదలకు అభయహస్తం, ఆరు గ్యారెంటీలు అందించాలని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని, తమశాఖలు అమలుపరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అట్టడుగు స్థాయికి చేరేలా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సంస్థ సేవలు మరింత విస్తరించడానికి సంస్థలో ప్రతీ అధికారి సభ్యత్వం తీసుకోవాలని అన్నారు. జిల్లాలో రక్తనిధి కొరత వల్ల చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని, గర్భిణులు ప్రమాదాల బారిన పడుతున్న వారికి సుమారు నెలకు వంద యూనిట్లకు పైగా రక్తం అవసరమవుతుందని అన్నారు. రక్తదానం చేస్తే మరో ప్రాణాన్ని కాపాడవచ్చని, వివిధ శాఖల ఉద్యోగులు ప్రతీనెల రక్తదానం చేసేలా క్యాలెండర్ రూపొందించుటకు త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు సాయన్న, సాయాగౌడ్, రాజారాం, భాగ్యలక్ష్మీ, దయానంద్, సాయిబాబా, సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తాం

భిక్కనూరు/మాచారెడ్డి/బీబీపేట, జనవరి 2: ప్రతీ గ్రామంలో అర్హులైనా ప్రతీ ఒక్కరి నుంచి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తామని కలెక్టర్ జితేష వి.పాటిల్ అన్నారు. మంగళవారం భిక్కనూరు మండలంలోని బస్వాపూర్, మాచారెడ్డి మండలంలోని అక్కాపూర్, పాల్వంచ మండలంలోని బండ రాజుపల్లి, బీబీపేట మండలంలోని తుజాల్‌పూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన దరఖాస్తులు చేసుకోవడానికి వచ్చిన ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి దరఖాస్తు ఫారాలను అందించడం జరుగుతుందని, ఎవరూ ఇబ్బందులు పడొద్దన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు ఇవ్వడానికి వస్తున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని సూచించారు. రేషన్‌కార్డు, భూ సమస్యలకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనంత్‌రావు, ఎంపీవో ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ లీలావతి, ఉప సర్పంచ్ భిక్షపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడుల్లోనే ఉండాలి



పాత రాజంపేటలో బడి బయటి పిల్లలను గుర్తించిన దృశ్యం

- ముమ్మరంగా సాగుతున్న బడి బయటి పిల్లల సర్వే
- జిల్లాలో 61 క్లస్టర్ల పరిధిలో సర్వేలో పాల్గొన్న సీఆర్పీలు, ఉపాధ్యాయులు
- ఇప్పటి వరకు 515 మంది విద్యార్థుల గుర్తింపు

భిక్కనూరు, జనవరి 2: విద్యా హక్కు చట్టం ప్రకారం బడీడు పిల్లలు తప్పకుండా బడిలోనే ఉండాలి. కానీ చాలా గ్రామాల్లో అనేక కారణాలతో విద్యార్థులు కొందరు బడి మానేసి పనుల్లో చేరుతున్నారు, మరికొందరు జులాయిగా తిరుగుతున్నారు. ఎక్కువగా ఇటుక బట్టీలు, ఫ్యాక్టరీల్లో, ఇతరితర దుకాణాల్లో, హోటళ్లలో, గొర్రెల కాపరులుగా పని చేయడంతో పాటుగా మరికొందరు తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో ఆసరా అవుతున్నారు. దీంతో విద్యాధికారులు గ్రామాల్లో బడి మానేసిన పిల్లలను గుర్తించి మరల బడిలో చేర్పించేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు బడి బయటి పిల్లల సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతీ సంవత్సరం నిర్వహిస్తుండగా ఈ యేడు గత డిసెంబరు 11 నుంచి జనవరి 10 వరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి సీఆర్పీలు, ఐఆర్పీలు నిర్వహిస్తున్నారు.

6 నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థుల గుర్తింపు

గతంలో కేవలం ఆరు సంవత్సరాల నుంచి 14 సంవత్సరాలలోపు పిల్లలను ఈ కార్యక్రమంలో భాగంగా గుర్తించేవారు. కానీ గత సంవత్సరం నుంచి 14 సంవత్సరాలలోపు వారితో పాటుగా 15 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాలలోపు ఉండి విద్యను ఆపేసిన వారిని సైతం గుర్తిస్తున్నారు. వీరితో పాటుగా దివ్యాంగులు (ప్రత్యేక అవసరాలు కలిగిన వారు) 18 సంవత్సరాలలోపు ఉన్న వారిని గుర్తించి ఈ నెల 11లోపు ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేసి విద్యాశాఖకు నివేదిక అందజేయనున్నారు. ఇందులో 14 సంవత్సరాలలోపు ఉన్న వారిని పాఠశాలల్లో చేర్పిస్తుండగా చిన్న వయస్సు కలిగిన బాలికలను, అనాథలను, ఆర్థిక స్థోమత లేనివారిని కస్తూర్బా పాఠశాలల్లో, గురుకులాల్లో చేర్పించే విధంగా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. 15 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాలలోపు ఉన్నవారిని ఓపెన్ టెన్త్‌లో, ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. కాగా ఇటుక బట్టీలు, ఫ్యాక్టరీల వద్ద ఎక్కువ స్థాయిలో వలసవచ్చిన వారి పిల్లలు ఉన్నట్లయితే అక్కడే ప్రత్యేకంగా పాఠశాలను ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేయనున్నారు. అందుకు ఆ ఫ్యాక్టరీ, ఇటుక బట్టీల యజమానుల సహకారంతో పాటుగా ప్రభుత్వం సైతం కొంత ప్రోత్సాహాన్ని అందజేస్తోంది.

61 క్లస్టర్లు.. 77 మంది సీఆర్పీలు, 42 మంది ఐఆర్పీలు

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 61 క్లస్టర్ల పరిధిలో 77 మంది సీఆర్పీలు, 42 మంది ఐఆర్పీలు ఉన్నారు. వీరందరూ ఈ బడి బయట సర్వే కార్యక్రమంలో పాలు పంచుకుంటున్నారు. ప్రతీ గ్రామంలో ఈ నెల 10 వరకు సీఆర్పీలు, ఉపాధ్యాయులు బడీడు పిల్లలను గుర్తించి రోజువారీగా ప్రబంధ్ పోర్టల్‌లో వారి ఆధార్ కార్డు నెంబర్‌తో పాటుగా, ఫోన్ నెంబర్‌ను నమోదు చేస్తున్నారు. దీంతో వీరిని ఏఏ పాఠశాలల్లో చేర్పించారు, ఏ తరగతి చదువుతున్నారు అన్న విషయాలు క్షుణ్ణంగా తెలిసిపోతోంది. కాగా గుర్తించిన విద్యార్థుల వయస్సు, అభ్యాసన సామర్థ్యాల ఆధారంగా వారిని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా తరగతుల్లో చేర్పిస్తున్నారు. కాగా ఈ కార్యక్రమం విజయవంతానికి జిల్లాలోని ఐదుగురు సెక్టోరియల్ అధికారులు మానిటరింగ్ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నారు.

ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 484 మంది గుర్తింపు

జిల్లా వ్యాప్తంగా 61 క్లస్టర్లలో డిసెంబరు 11 నుంచి ఇప్పటి వరకు 515 మంది గుర్తించారు. గుర్తించిన వీరందరిని ప్రబంధ్ పోర్టల్‌లో వారి ఆధార్ నెంబర్‌తో పాటుగా వీరి పూర్తి వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమ చివరి తేదీ ఈ నెల 10 వరకు ఈ విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు గుర్తించిన వారిలో 6 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాలలోపు పిల్లలు 200 మంది, 15 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలు 176 మంది, వలస వచ్చిన కార్మికుల పిల్లలు 139 మంది ఉన్నారు.

ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నాం

- వేణుగోపాల్ శర్మ, సెక్టోరియల్ అధికారి

జిల్లా వ్యాప్తంగా ఈ నెలాఖరు వరకు ఈ బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్పీలు, ఐఆర్పీలు పాల్గొంటుండగా ఎప్పటికప్పుడు జిల్లాలోని సెక్టోరియల్ అధికారులుగా ఉన్న ఐదుగురం ఈ కార్యక్రమాన్ని మానిటరింగ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమ విజయవంతానికి కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, మండల, జిల్లా అధికారులందరం సమన్వయంతో ముందుకు సాగుతున్నాం. ఈ సర్వే ముగిసేనాటికి జిల్లాలోని 6 సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్క పిల్లవాడు పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు 345 మంది బడి బయటి పిల్లలతో పాటుగా 139 మంది వలస కార్మికుల పిల్లలను గుర్తించాం.

బీఆర్ఎస్ నాయకుల్లారా.. ఖబడ్దార్



నాచుపల్లిలో రాములు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- హత్య చేసిన వారిని చట్టపరంగా శిక్షిస్తాం
- ఇసుక అక్రమ రవాణాపై మైనింగ్ అధికారులు సర్వే చేయాలి
- రాములు కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది
- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు
- తక్షణ సాయం కింద రూ.లక్ష అందజేత

బాన్సువాడ/నస్రుల్లాబాద్, జనవరి 2: కాంగ్రెస్ నాయకుడు సాదుల రాములను హత్య చేసిన వారిని చట్టపరంగా శిక్షిస్తామని ఎక్సైజ్, పర్యాటకం-సాంస్కృతికం, పురావస్తుశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలోని కాంగ్రెస్ నాయకుడు సాదుల రాములు ఇంటికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించానన్నారు. తక్షణ సహాయం కింద పార్టీ ఫండ్ నుంచి రూ.లక్ష అందజేశామని, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏనుగు రవీందర్‌రెడ్డి మరో రూ.లక్ష అందజేశారన్నారు. రాములు కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం బాన్సువాడ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల్లారా ఖబార్దార్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఎలాంటి దాడులు జరిగినా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు కావాలనే కక్ష్య కట్టి రాములను హత్య చేశారని ఆయన ఆరోపించారు. గత ఎన్నికల్లో తక్కువ మెజార్టీతో రాములు సర్పంచ్‌గా ఓడినా వచ్చే ఎన్నికల్లో మళ్లీ సర్పంచ్‌గా గెలుస్తాడనే హత మార్చారని ఆయన పేర్కొన్నారు. ఇసుక మాఫియా నాయకులు నాచుపల్లి విండో చైర్మన్ సుధీర్ ప్రణాళిక ప్రకారం నలుగురు వ్యక్తులతో కలిసి హతమార్చారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను కార్యకర్తలను కాపాడుకుంటామని బీఆర్ఎస్ నాయకులపై ఉక్కుపాదం మోపి అణిచి వేస్తామన్నారు. హత్య చేసిన ఐదుగురిని ఊచలు లెక్కపెట్టేలా కఠిన చర్యలు తీసుకుం టామన్నారు. ఇసుక అక్రమ రవాణా పేరిట మంజీరాలో ఇసుక మాఫియా ఎన్ని క్యూబిక్ మీటర్లు ఇసుకను తవ్వించారనేది జిల్లా మైనింగ్ అధికారులు సర్వే చేయాలని ఆదేశించారు. అక్రమ ఇసుక దోపిడీకి పాల్పడిన వారిని పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, నాయకులు రత్నకుమార్, శ్రీనివాస్, రాజిరెడ్డి, ప్రతాప్‌సింగ్, అఫ్రోజ్, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డిటౌన్, జనవరి 2: ట్రాఫిక్ నిబంధనలను వాహనదారుల సౌకర్యం, రోడ్డు ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసినవని వాటిని ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని ఎస్పీ సింధూశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో చాలామంది వాహనదారులు తమ వాహనాలకు నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలపై ప్రయాణిస్తున్నారని అది చట్టరీత్య నేరమన్నారు. ఇకనైనా తమ వాహనాలకు నంబర్‌ప్లేట్‌లు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఉండాలని లేకపోతే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనం నెంబర్ స్పష్టంగా కనిపించే విధంగా నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని అసభ్యకరమైన రాతలు, నంబర్ కనిపించకుండా చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. వాహనాలకు నంబర్‌ప్లేట్ పెట్టకపోవడం వలన నేరగాళ్లకు అవకాశం కల్పించిన వారమవుతామని తెలిపారు. అలాగే మైనర్లు వాహనాలు నడిపితే సంబంధిత కుటుంబ పెద్దలపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రిఫిక్ నిబంధనలు పాటించకుండా తప్పించుకునే ప్రయత్నంలో మరిన్ని ఇబ్బందులు తప్పవని, ట్రాఫిక్ పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నిబంధనలు పాటించకుండా తిరిగేవారిపై కఠినంగా వ్యవహరిస్తూ కేసులు నమోదుచేయాలని సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు. ప్రధాన రహదారులతో పాటు, గల్లీలలో కూడా ఆకస్మిక తనిఖీలు చేయాలని సూచించారు.

పిల్లలను బడిలో చేర్పించిన సీఆర్పీలు

నిజాంసాగర్, జనవరి 2: బడిబయట పిల్లలు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల సర్వే చేసి బడిలో చేర్పించినట్లు సీఆర్పీలు తెలిపారు. మండలంలోని మంగ్లూర్ గేటు వద్ద గల ఇటుక బట్టీలో వేరే రాష్ట్రాల నుంచి వలస వచ్చిన విద్యార్థులను గుర్తించి, వారిని పక్క గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో చేర్పించామన్నారు. ఇటుక బట్టీల యజమానులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. నర్సింగ్ రావుపల్లి, మంగ్లూర్, తదితర చోట్ల సర్వే చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం యశ్వంత్, సీఆర్పీలు వరలక్ష్మీ, ఐఈ ఆర్పీ చిన్న సాయిలు తదితరులున్నారు.

ముమ్మరంగా ఓటరు నమోదు ప్రక్రియ

భిక్కనూరు, జనవరి 2: ఓటు హక్కు కలిగి ఉండటం ప్రతి పౌరుడి బాధ్యత. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైంది. రాష్ట్రంలో మరో ఎన్నికల పండుగ రానున్న నేపథ్యంలో కేంద్రం ఎన్నికల సంఘం ఓటరు నమోదు కార్యక్రమానికి మరో అవకాశం కల్పించింది. ప్రతీ యేటా ఓటరు జాబితా సవరణ షెడ్యూల్‌ను ప్రకటిస్తుండగా ఇటీవల ముగిసిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం పలుమార్లు ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా అర్హులైన వారి వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించి తుది జాబితాను ప్రకటించి దాని ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలను ఎన్నికల సంఘం నిర్వహించింది. మరికొన్ని రోజుల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు, ఎంపీ ఎన్నికలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ముమ్మరం చేసింది.

18ఏళ్లు నిండిన వారికి అవకాశం

ఇప్పటివరకు ఎన్నికల జాబితాలో లేనివారు వచ్చే జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారి కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడానికి బీఎల్‌వో వద్ద ఫారం-6 ద్వారా కానీ, సీఈవో వెబ్‌సైట్‌లో కానీ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్నికల సంఘం ఫిబ్రవరిలో ప్రకటించే తుది జాబితాలో పేరుంటే రానున్న ఎన్నికల్లో వారు ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

జనవరి 5వరకు నమోదుకు ఛాన్స్

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 20న ప్రారంభమైన ఓటరు జాబితా సవరణ ప్రక్రియ జనవరి 5 2024వరకు చేపట్టనున్నారు. ఇందుకు బూత్ లెవల్ అధికారులు నూతన దరాఖాస్తులను తీసుకోవడంతో పాటుగా ప్రస్తుతం ఉన్నవారిలో ఏమైనా మార్పులు, చేర్పులు ఉన్న వారికి అవకాశం కల్పించనున్నారు. జనవరి 5న ఈ కార్యక్రమం పూర్తికాగానే 6న ముసాయిదా జాబితా ప్రకటించి 22వరకు అభ్యంతారాలను స్వీకరిస్తారు. స్వీకరించిన అభ్యంతరాల పరిష్కారానికి బూత్ లెవల్ అధికారులు మరోమారు సర్వే చేపట్టి వాటిని పరిష్కరిస్తారు. ఇందులో భాగంగానే బోగస్ ఓట్లు, మృతుల ఓట్లు తొలగిస్తారు. అనంతరం ఫిబ్రవరి 2న జాబితా పరిశీలించి 8న తుది జాబితాను ప్రకటిస్తారు.

ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

:శివప్రసాద్, తహసీల్దార్ (భిక్కనూరు)

జనవరి 1 నాటికి 18ఏళ్లు నిండినవారు బీఎల్‌వో వద్ద కానీ, సీఈవో వెబ్‌సైట్‌లో కానీ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఓటరు నమోదు విజయవంతానికి గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది.

ముసుగును తొలగించిన అధికారులు



ముసుగును తొలగించిన దృశ్యం

ఆర్మూర్‌టౌన్, జనవరి2: ఎన్నికల కోడ్ ముగిసినా ముసుగు తొలగించని అధికారులు అని మంగళవారం 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించి అర్గుల్ రాజారాం విగ్రహానికి అధికారులు ముసుగును తొలగించారు. పట్టణంలోని నడిబొడ్డున గల వాటర్ ఫౌంటేన్ వద్ద అర్గుల్ రాజారాం విగ్రహానికి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ముసుగు వేసిన అధికారులు తొలగించడాన్ని మరిచిపోయారు. దీంతో ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ విగ్రహానికి ఉన్న ముసుగు తీయకపోవడం పట్టణంలో చర్చనీయాంశమైంది. ఎట్టకేలకు ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో అధికారులు స్పందించి ముసుగును తొలగించారు.

ఈసీ అనుమతులను అమలు చేయాలి

డిచ్‌పల్లి, డిసెంబరు 2: గత పాలక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలు చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం టీయూ రిజిస్ట్రార్ కార్యాలయంలో టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరిని నిలదీశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే తెలంగాణ యూనివర్సిటీని ప్రక్షలన చేయాలని, రెగ్యులర్ వీసీని నియమించాలని డిమాండ్ చేశారు. అవినీతి చేసిన అధ్యాపకులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో నూతన కోర్సులను అమలు చేయాలని, అధ్యాపకుల పోస్టులను, నాన్ టీచింగ్ ఫ్యాకల్టీని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.100కోట్ల నిధులు మంజూరు చేయాలని టీయూ అభివృద్ధి పర్చలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శివా, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో బారులు తీరిన వాహనదారులు

డొంకేశ్వర్, జనవరి2: పెట్రోల్ ట్యాంకర్ల యజమానులు సమ్మె పిలుపుతో పెట్రోల్ బంకులు మూడు రోజుల పాటు మూసి ఉంటాయని ప్రచారం జోరుగా సాగడంతో డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లికి వెళ్లే మార్గంలో ఉన్న పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర వాహనదారులు బరులు తీరారు. ఇంధనం కోసం ప్రజలు క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. గంటల తరబడి వాహనదారులు క్యూలైన్‌లో నిలబడిన పెట్రోల్ పోసుకుని వెళ్లారు.

నవీపేట,జనవరి2: దేశవ్యాప్తంగా ట్రక్కులు, ట్యాంకర్ల డ్రైవర్లు మెరుపు సమ్మెకు దిగడంతో ఇంధన సరఫరా నిలిచిపోయిందనే అనుమానంతో మండల కేంద్రంలోని పలు పెట్రోల్ బంకుల వద్ద మంగళవారం రాత్రి జనం బారులు తీరారు. పెట్రోల్, డీజిల్ కోసం భారీ సంఖ్యలో వాహనాలు రావడంతో బంకుల యజమానులు వాహనాలను నియంత్రించడానికి ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ తమకు దొరకదేమోనన్న అనుమానంతో జనం అవసరానికి మించి కొనుగోలు చేశారు.

రాజ్యసభ సభ్యుడిని కలిసిన టెలీకాం బోర్డు డైరెక్టర్

డొంకేశ్వర్, జనవరి2: హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యుడు కేఆర్.సురేష్‌రెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం డొంకేశ్వర్ మండలానికి చెందిన జిల్లా టెలీకాం బోర్డు డైరెక్టర్ చిన్న దొడ్ల కిశోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేఆర్.సురేష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్ , జనవరి2: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని లాలన వృద్ధాశ్రమాన్ని క్షత్రీయ పాఠశాల విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ఆశ్రమంలోని వృద్ధులను ఆత్మీయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థుల ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సింహస్వామి మాట్లాడుతూ విద్యార్థులు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం హర్షనీయమని ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో ప్రేమ, సేవభావం ఏర్పడుతుందన్నారు.

నేడు లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలలో పాల్గొన్న శాలివాహన దేవాదాయ కమిటీ సభ్యులు

ముప్కాల్, జనవరి2: మండల కేంద్రంలో శాలివాహన దేవాదాయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో రెండు రోజులుగా లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం 3గంటలకు ఉత్తర పాల్గుణ నక్షత్రయుక్త వృశిక లగ్న పుష్కరాంశ సప్తమి ముహూర్తంలో విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన, మహాపూర్ణాహుతి, మహాదాశీర్వవచనం, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు



జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు

మోర్తాడ్, జనవరి2: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను గ్రామసర్పంచ్ బద్దం చిన్నారెడ్డి, బద్దం చంద్రశేఖర్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు విద్యాసాగర్‌రెడ్డి, డి.శ్యామ్, నరేంద్ర, గ్రామ కమిటీ సభ్యులు, ఆలయకమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో ఎస్‌బీఐ ప్రారంభం

ముప్కాల్, జనవరి2: బాల్కొండ మండలం కిసాన్‌నగర గ్రామంలో గల స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లు ఆధునిక హంగులతో తీర్చిదిద్ది మంగళవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 60 ఏళ్ల నుంచి ఈ ప్రాంత ప్రజలకు సేవలందిస్తూ లాభల్లో కొనసాగుతుందని, కస్టమర్ల సౌకర్యార్థం రూ.కోటి వ్యాయంతో కిసాన్‌నగర్ శాఖను ఆధునీకరించామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దాసరి లావణ్య వెంకటేష్, వేంపల్లి సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, ఎంపీటీసీ సభ్యులు నారాయణ, బ్రాంచ్ మేనేజర్ జి.రాజేష్, కస్టమర్లు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

బోధన్ రూరల్, జనవరి 2 : చెందిన అమెరికాలోని అఫ్‌లెంట్ స్టాఫ్ సంస్థ నిర్వాహకుడు, బోధన్‌కు చెందిన పవన్ రాజ్ ఆర్థిక సహకారంతో మండలంలోని చింతకుంట గ్రామంలోని అనాథ ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, చీరలు, పంచెలు, నిత్యవసర సరుకులు, పండ్లను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరంలాగే జనవరి 1న సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వ్యాపార వేత్త నరసింహరావు తెలిపారు. కార్యక్రమంలో బాల గంగాధర్, వీరేశం, వార్డెన్ గంగామణి ఉన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవా ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు, నిరుపేదలకు ఉచితంగా బట్టలను, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఇందూర్ విద్యా సంస్థల అధినేత కొడాలి కిశోర్‌కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సభ్యులు తదితరులు ఉన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల ఊరేగింపు

రెంజల్,జనవరి2: మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో మంగళవారం అయోధ్య రామ మందిరం పూజిత అక్షింతలను రాముల వారి చిత్ర పటంతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బైండ్ల రాజు, గంగాధర్, శంకర్, రాజేందర్, శంకర్, తదితరులున్నారు.

శ్రీరాముడి అక్షింతలకు పూజలు

నవీపేట: మండలంలోని పోతంగల్‌లో మంగళవారం అయోధ్యలోని శ్రీరాముడికి చెందిన అక్షింతలకు పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయ సహిత హనుమాన్ మందిరంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో అక్షింతల కలశానికి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో జరిగిన పూజలలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాంకిషన్ రావు, సర్పంచ్ రవీందర్ రావు, యూత్ సభ్యులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

కరసేవలో పాల్గొన్న వ్యక్తికి అయోధ్య అక్షింతల అందజేత

నిజామాబాద్ అర్బన్: అయోధ్యలో రామమందిరం నిర్మాణం కోసం జరిగిన కరసేవలో పాల్గొన్న నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన న్యాలం



పోతంగల్ శివాలయంలో అక్షింతలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



జిల్లా కేంద్రంలో అక్షింతలను అందజేస్తున్న దృశ్యం



వీరన్నగుట్టలో అక్షింతలను ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఆనంద్‌కు మంగళవారం ట్రస్ట్ ప్రతినిధులు అయోధ్య బాల రామ మందిరం అక్షింతలను అందజేశారు. అప్పట్లో అయోధ్య రామమందిరం నిర్మాణం కోసం నిర్వహించిన కరసేవలో చాలా మంది పాల్గొన్నారు. ఎన్నో ఇబ్బందులు, హింసలు చెలరేగినప్పటికీ రామమందిరం నిర్మాణమే ధ్యేయంగా కరసేవకు వెళ్లిన వారికి అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో రామజన్మభూమి ట్రస్టు ప్రతినిధులు స్వామియాదవ్, లక్ష్మణ్, రాము, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంబంలో అక్షింతల వితరణ

వర్ని: రుద్రూరు మండలం అంబం గ్రామంలో మంగళవారం గడప గడపకూ అయోధ్య శ్రీరామ అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుర్లేపు గంగాధర్, సాయి ప్రసాద్, మంత్రి లక్ష్మణ్, ఇందూరు నాని, సాయిలు, కుమ్మరి రవి, శానం సాయిరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను తప్పుదోవ పట్టించి.. ముప్పుతిప్పలు పెట్టి..

● దుబ్బాక ఐవోబీ బ్యాంకులో చోరీకి దొంగ విఫలయత్నం ● రెండు గంటల తర్వాత దొంగ అరెస్టు

ధర్పల్లి, జనవరి 2 : పోలీసులను తప్పుదోవ పట్టించి.. ముప్పుతిప్పలు పెట్టాడో దొంగ.. బ్యాంకులో చోరీకి యత్నించిన విషయం పోలీసులకు తెలియడంతో.. తనతో పాటు మరో ఎనిమిది మంది దొంగలు ఉన్నారని బుకాయించాడు. చివరకు భారీగా చేరుకున్న పోలీసులు రెండు గంటల తర్వాత షటర్ లోపలికి వెళ్లి చూడగా.. ఒక్కడే ఉండడంతో నివ్వెరపోయిన ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామంలోగల ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు (ఐవోబీ) లో సోమవారం అర్ధరాత్రి ఓ దొంగ చొరబడ్డాడు. బ్యాంకు ముందు భాగంలో గల షట్టర్‌ను పెకిలించి లోపలికి ప్రవేశించి కొద్దిసేపు బ్యాంకులో తిరుగుతూ స్ట్రాంగ్ రూమ్ వైపునకు వెళ్లాడు. స్ట్రాంగ్‌రూమ్‌ను పగల గొట్టేందుకు యత్నించగా.. బ్యాంకు మేనేజర్‌కు అలారం మోగడంతో అప్రమత్తమయ్యాడు. మేనేజర్ వెంటనే 100కు డయల్ చేయడంతో పాటు దుబ్బాక గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు వెంటనే బ్యాంకు వద్దకు చేరుకొని షట్టర్‌ను మూసివేశారు. అంతలోనే ధర్పల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకొని బయటకు రావాలని దొంగను హెచ్చరించారు. లయితే తనతో పాటు మరో ఎనిమిది మంది దొంగలు ఉన్నారని దొంగ పోలీసులను పక్కదారి పట్టించాడు. రెండు గంటల పాటు బ్యాంకులోనే ఉన్న దొంగ. పోలీసులను మభ్యపెట్టే ప్రయత్నం చేశాడు. బ్యాంకు లోపల దొంగల ముఠా ఉన్నారని చెప్పడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. దీంతో నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ సహా ధర్పల్లి,



బ్యాంకు వద్ద కాపలా కాస్తున్న గ్రామస్థులు

డిచ్‌పల్లి సీఐలు, పలువురు ఎస్సైలు.. పెద్ద మొత్తంలో తమ సిబ్బందితో హుటాహుటిన బ్యాంకు వద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత బ్యాంకు షట్టర్‌ను తీసి లోపలికి ప్రవేశించారు. అయితే బ్యాంకులో దొంగ ఒక్కడే ఉండడంతో.. పోలీసులు అతన్ని పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. చోరీకి పాల్పడేందుకు వచ్చిన వ్యక్తి రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డిగా పోలీసులు గుర్తించారు. మిగతా దొంగల ముఠా ఎక్కడ అని ప్రశ్నించగా.. ఎవరూ లేరని, తప్పించుకునేందుకే అలా చెప్పానని చెప్పడంతో ఆశ్చర్యపోవడం పోలీసుల వంతైంది. కాగా.. సంతోష్‌రెడ్డిపై గతంలో రెంజల్ పోలీస్ స్టేషన్‌లో మూడు చోరీ కేసులు నమోదయ్యాయి. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ధర్పల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

ఫ్లెక్సీవివాదం ఆలస్యంగా గ్రామసభ

కమ్మర్‌పల్లి, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభ మంగళవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఫ్లెక్సీవివాదంతో గ్రామసభ ఆలస్యంగా ప్రారంభమయ్యింది. మండలప్రత్యేక అధికారి యోహన్, ఎంపీడీవో సంతోష్‌రెడ్డి,ఎంపీపీ లోలం గౌతమి, ఎంపీటీసీ సుధాకర్ అధికారులు గ్రామపంచాయితీవద్ద ప్రజాపాలన గ్రామసభకు సమాయత్తమయ్యారు. అయితే ఫ్లెక్సీపై కేవలం సీఎం ఫోటో మాత్రమే ఉండడంతో బీఆర్‌నాయకులు వ్యతిరేకించారు. స్థానిక ఎమ్మెల్యే ఫోటో లేకుండా ఎలాప్రారంభిస్తారని వాదనకు దిగారు. దీంతో అక్కడ కొద్దిసేపు గందరగోళపరిస్థితి నెలకొంది. అధికారులు కొత్తఫ్లెక్సీ చేయించి తెప్పించడంతో వివాదం సద్దుమనిగింది. ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యేతో పాటు సీఎం, ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా ఎంపి, రాజ్యసభ ఎంపి, జడ్పీచైర్మన్,ఎమ్మెల్సీలు, ఎం పీపీ. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ , కోఆప్షన్ సభ్యుడి ఫొటోలతో ఫ్లెక్సీ తయారు చేయించారు.గ్రామసభ ఆలస్యంగా ప్రారంభమయింది. ప్రజాపాలన కార్యక్రమాల వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లవద్ద గ్రామస్థులు బారులు తీరి సంక్షేమ పథకాలకై దరఖాస్తులను అధికారులకు అందజేశారు..

పెట్రోల్‌బంక్‌లలో వాహనదారుల బారులు

భిక్కనూరు, జనవరి 2: కేంద్రం తెచ్చిన కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆయిల్ ట్యాంకర్లు ధర్నా చేస్తున్నారని పెట్రోల్‌బంక్‌లు కొన్నిరోజులు బంద్ ఉంటాయన్న ప్రచారంతో భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాలలో ఉన్న పెట్రోల్‌బంక్‌లకు వాహన దారులు మంగళవారం సాయంత్రం నుంచి బారులు తీరారు. ఒక్కసా రిగా పెట్రోల్‌బంక్‌లకు వాహనదారులు పెరగడంతో పెట్రోల్‌బంక్ సిబ్బ ంది ఇబ్బందులు ఎదుర్కోన్నారు. అసత్యపు ప్రచారాలను నమోద్దని పెట్రోల్ బంక్‌ల యాజమానులు చెప్పిన వాహనదారులు పట్టించుకో లేదు. కాగా మండలంలోని కొన్నిపెట్రోల్‌బంకులు నోస్టాక్‌బోర్డులు పెట్టి మూసి వేశారు.

పెద్దమల్లారెడ్డి పెద్దచెరువు నీటి విడుదల

భిక్కనూరు,జనవరి 2: భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి పెద్దచెరువు నీటిని మం గళవారం గ్రామ ప్రజాప్రతినిధులు విడుదల చేశారు. ముందుగా చెరువు తూముకు, గంగ మ్మకు గ్రామపెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దమల్లారెడ్డి, కంచర్ల సర్పంచ్‌లు లక్ష్మీరాజలింగం, చంద్రకళ మాధవరెడ్డి, విండో చైర్మన్ రాజా గౌడ్ మాట్లాడుతూ పెద్దమల్లారెడ్డి, కంచర్ల గ్రామాల పంటల సాగుకై గ్రామ పెద్దచెరువు నుంచి నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాయాగౌడ్, మంజుల, గ్రామపంచా యతీ పాలకవర్గం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కామారెడ్డిటౌన్,డిసెంబరు 2: కామారెడ్డి జిల్లా కోర్టులో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా ప్రధాన న్యాయాధికారిని ఎస్ఎన్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ న్యాయాధికారిని నాగరాణి, ప్రథమశ్రేణి న్యాయాధికారులు సుధాకర్, బార్‌అసోసియేషన్‌అధ్యక్షుడు శ్రీధర్,జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సం ఘం అధ్యక్షుడు భుజంగరావు,అసోసియేట్ అధ్యక్షుడు శ్రీధర్ తదిత రులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పీసీసీ ప్రధానకార్యదర్శి

భిక్కనూరు, జనవరి 2: కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్‌ను పీసీసీ ప్రధానకార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా తన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మా నించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా సంకల్ప వికసిత్ భారత్

వర్ని,జనవరి2: రుద్రూర్ మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర రసాభాసగా మారింది. కార్యక్రమ నిర్వహణ గురించి ఎంపీడీవో, కార్యదర్శి ముందుగా చాటింపు ఇవ్వకపోవడంతో ప్రజలు రాక బోసిపోవడంతో బీజేపీ శ్రేణులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమం పక్కనే ప్రజా పాలన దరఖాస్తుల సమర్పణకు వందల సంఖ్యలో బారులు తీరారు. దీంతో అదే ప్రాంతంలో ఎల్ఈడీ ఏర్పాటు చేయగా ప్రజలు కార్యక్రమం వీక్షణకు దూరంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని బీజేపీ శ్రేణులు మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో సర్పంచ్ ఇందూరి చంద్రశేఖర్ జరిగిన పొరపాటును గమనించి ఆందోళనకారులకు నచ్చజెప్పి సముదాయించారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని గంట సేపు నిలిపివేయించి కార్యక్రమ నిర్వహణకు కృషి చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు.



పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

ప్రారంభోత్సవానికి సిద్ధంగా జక్రాన్‌పల్లి పాఠశాల భవనం

● రేపు మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు ● పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పైపుల రాజారెడ్డి



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న పాఠశాల భవనం



మాట్లాడుతున్న పైపుల రాజారెడ్డి

జక్రాన్‌పల్లి, జనవరి2: జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభోత్సవానికి గురువారం మంత్రి దామోదర రాజనర్సింహ రానున్నట్లు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, ప్రధాన దాత, ప్రముఖ పారిశ్రామికవేత్త పైపుల రాజారెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాల భవనం, తరగతి గదుల ప్రారంభోత్సవానికి మంత్రి దామోదర నర్సింహతో పాటు ఎంపీలు ధర్మపురి అర్వింద్, సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, రాకేష్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపసర్పంచ్ బాలకిషన్, ఎంపీటీసీలు రూపాల గంగారెడ్డి, డాక్టర్ సుబాష్, ఉమ మహేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో..

జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యం కల్పించేందుకు గత ఏడాది ప్రాముఖ పారిశ్రామికవేత్త దాత పైపుల రాజారెడ్డి ముందుకు వచ్చారు. ఈ పాఠశాలలో 2023 ఫిబ్రవరి 3న ఈ పాఠశాలలో రూ.50లక్షల పాఠశాల తరగతి గదుల నిర్మాణ పనులను చేపట్టారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు ఎందరో దాతలు ముందుకు వచ్చి పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి విరాళాలు అందజేశారు. మొదట రాజారెడ్డి తనవంతు రూ.75లక్షలతో పాఠశాల భవనం, తరగతి గదుల పనులను నిర్మించారు. ఆయన కుటుంబసభ్యులు తరగతి గదుల నిర్మాణానికి రూ.కోటి నగదును అందజేశారు. పలువురు దాతలు విరాళాలు పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. సుమారు రూ.3కోట్లతో ఈ పాఠశాల భవనం 20 తరగతి గదులు, తొమ్మిది మడిగెలు, వంటశాల గదులు, నిర్మించి పూర్తి చేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

రెంజల్,జనవరి2: మండలంలోని దూపల్లి గ్రామ శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దూపల్లి గ్రామ శివారులో ఇసుకను ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట సిబ్బంది గంగాధర్, శంకర్ రెడ్డి, శేఖర్, శ్రీనివాస్, పవన్ తదితరులున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

రెంజల్,జనవరి2: మండల కేంద్రానికి చెందిన అగ్గు శంకర్(47)అనే వ్యక్తి గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన అగ్గు శంకర్ డిసెంబరు 31నఇంట్లో భార్యతో గొడవ పడ్డాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న శంకర్ క్షణికావేశంలో తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య స్థానికుల సహాయంతో శంకర్‌ను 108అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న శంకర్ మంగళవారం ఉదయం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. శంకర్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారని, అతడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి

మోపాల్,జనవరి 2: గత 15 రోజుల క్రితం గాలిపటం కోసం చెట్టు ఎక్కికిందపడిన కేతావత్ బంటు (13) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని మంచిప్ప గ్రామానికి చెందిన కేతావత్ బంటు గాలిపటం ఎగరవేస్తుండగా చెట్టుకు తగలడంతో చెట్టుఎక్కడంతో ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

అదృశ్యమైన యువకుడు శవమై కనిపించాడు

మోర్తాడ్, జనవరి2: మోర్తాడ్‌లో ఐదు రోజుల క్రితం అదృశ్యమైన అడే అజయ్(25)అనే యువకుడు మంగళవారం ఉదయం వరద కాలువలో శవమై కనిపించాడని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలం కోడర్నా గ్రామానికి చెందిన అడేఅజయ్ బతుకుదెరువు కోసం మోర్తాడ్‌లోని ఓప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పని చేస్తుండేవాడని ఎస్సై తెలిపారు. కాగాఆసుపత్రి వారికి ఇద్దరి మధ్య వివాదాలు రావడంతో ఆయన సొంతంగా ల్యాబ్ పరీక్షలు చేయడానికి పెట్టుకున్నాడని ఎస్సై తెలిపారు. ఇట్టి ఆసుపత్రి వారికి చెల్లించాల్సిన డబ్బులపై ఒత్తిడి చేయడంతో మనసికంగా కుంగిపోయి వరదకాలువలో పడిఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సైతెలిపారు.కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వఆసుపత్రికి పంపి కేసునమోదు చేస్తున్నామ న్నారు.

● కుటుంబ సభ్యుల ఆందోళన

మృతుడు అజయ్ కుటుంబసభ్యులు తరలివచ్చి ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు. ఆసుపత్రి వర్గాలు తన కుమారుడిపై వేధింపులకు గురి చేయడం వల్లనే ఆత్మహత్య చేసుకున్నాని ఆరోపిస్తూ ధర్నా చేశారు. పోలీసులు కుటుంబసభ్యులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం పోస్టు మార్టం అనంతరం శవాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లారు.

పెద్దమల్లారెడ్డి పెద్దచెరువు నీటి విడుదల

భిక్కనూరు,జనవరి 2: భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి పెద్దచెరువు నీటిని మం గళవారం గ్రామ ప్రజాప్రతినిధులు విడుదల చేశారు. ముందుగా చెరువు తూముకు, గంగ మ్మకు గ్రామపెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరంపెద్దమల్లారెడ్డి, కంచర్ల సర్పంచ్‌లు లక్ష్మీరాజలింగం, చంద్రకళ మాధవరెడ్డి, విండో చైర్మన్ రాజాగౌడ్ మాట్లాడుతూ పెద్దమల్లారెడ్డి, కంచర్ల గ్రామాల పంటల సాగుకై గ్రామ పెద్దచెరువు నుంచి నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాయాగౌడ్, మంజుల, గ్రామపంచా యతీ పాలకవర్గం సభ్యులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు

సుభాష్‌నగర్, జనవరి 2: అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మిస్తున్నారని కార్పొరేటర్‌పై నవీన్‌రెడ్డి అనే వ్యక్తి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటిని నిర్మిస్తున్నాడని ఇన్‌వార్డులో వినతిపత్రం అందజేశారు. ఇంటికి అనుమతి తీసుకోకపోవడమే కాకుండా నిర్మాణం కోసం ఉపయోగిస్తున్న సిమెంట్, దుమ్ము, దూళి రావడం వల్ల ఆరోగ్యం చెడిపోతుందని తెలిపారు. కనీసం ఎలాంటి అడ్డు పెట్టకుండా నిర్మాణం జరుగుతుందన్నారు. త్వరగా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

భిక్కనూరు, జనవరి 2: మాజీ ఎమ్మెల్యే గంపగోవర్దన్‌పై అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేది లేదని మండలంలోని బస్వాపూర్ బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత కొన్నిరోజుల క్రితం తొలివెలుగు యూట్యూబ్ ఛానెల్‌లో బస్వాపూర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్ అక్రమంగా 500ల వికలాంగుల పింఛన్లను ఇప్పించారని అసత్యపు వార్తలను ప్రచారం చేశారని, ఎలాంటి నిజనిజాలను తెలుసుకోకుండా అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేదిలేదన్నారు. గ్రామంలో మొత్తంగా 88వికలాంగుల పింఛన్లు మాత్రమే ఉన్నాయని సదరు యూట్యూబ్ ఛానెల్ ప్రతినిధులు బస్వాపూర్ గ్రామానికి గానీ, ఎంపీడీవో కార్యాలయానికి గానీ వెళ్లి విచారణ చేసుకో వచ్చు నని అన్నారు. వెంటనే ఆ యూట్యూబ్ ఛానెల్ యాజమాన్యం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పిలని లేని యెడల యూట్యూబ్ ఛానెల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బుర్రి గోపాల్, మల్లారెడ్డి, మల్లేషం, మద్ది స్వామి, సిద్ధరాములు, భిక్షపతి, మల్లేశం, బాలాగౌడ్, రాజి రెడ్డి, వంశీ, తదితరులు పాల్గొన్నారు.



బస్వాపూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నాలుగో రోజూ ప్రజాపాలనకు అదే జోరు


గోపాల్‌పేట్‌లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు


అన్నారంలో ప్రజాపాలనలో దరఖాస్తులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో


దామరంచ గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ జనార్దన్

నాగిరెడ్డిపేట,జనవరి 2: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ప్రజాపాలన కార్యక్రమానికి మంగళవారం నాలుగో రోజూ ప్రజల్లో అదే జోరుకనిపించింది. అభయ హస్తం గ్యారెంటీ సంక్షేమ పథకాల కోసం ప్రజలనుంచి అధికారులు భారీగా దరఖాస్తులను స్వీకరించారు. ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని డిసెంబరు 28న ప్రారంభించగా, డిసెంబర్ 28, 29, 30వ తేదీలలో కార్యక్రమాన్ని నిర్వహించగా డిసెంబరు 31, జనవరి 1న రెండు రోజులు సెలవులు రావడంతో ప్రజాపాలన కార్యక్రమం వాయిదా పడి తిరిగి మంగళవారం 4వ రోజు ప్రజాపాలన కార్యక్రమం యథావిధిగా ప్రారంభమైంది. మండలంలో 4వ రోజు గోపాల్‌పేట్, తాండూర్ గ్రామా లలో అధికారులు కార్యక్రమా న్ని నిర్వహించారు. గ్రామాల్లో గ్రామ సభ లను ఏర్పాటు చేసి మొదట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశంతో కార్యక్ర మాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ గ్యారెంటీ స్కీంలకు సంబంధించి ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. దరఖా స్తుల స్వీకరణకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఈసందర్భంగా ఏర్పాటైన సమావేశంలో జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరుగ్యారెంటీ పథకాలకు అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజాపాలన కార్య క్రమం చేపట్టి ప్రజల వద్దకే అధికారులు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీపీ రాజ్‌దాస్, మండల కో-ఆప్షన్ సభ్యుడు షాహెద్‌పాషా, సర్పంచ్‌లు వంజరి సునీత, గంగమణి, ఎంపీటీసీ మాధవి, మండల ప్రత్యేకఅధికారి రఘునందన్ రావు, తహసీ ల్దార్ మహేందర్ కుమార్, ఎంపీడీవో, ఎంపీవో, ఏవోవివిధ శాఖల అధికారులు, జీపీకార్యదర్శులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: మద్నూర్, డోంగ్లీ మండలాల్లో 4వ రోజు మండలంలోని 6 గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం సజావుగా జరిగింది. ఈకార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని ప్రజల నుంచి అభయహస్తం దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని కొడిచిర, మేనూర్ గ్రామాల్లో తహసీల్దార్ ముజీబ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం కింద ఇచ్చిన హామీ మేరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, పెద్ద తడ్గూర్, 730 కొడిచిరలో 780, తడి హిప్పర్గ 450, మేనూర్ 696, మాధన్ హిప్పర్గ 403, ఇలేగాం 125 దరఖాస్తులు చేసుకున్నారు. ఉమ్మడి మండలాల్లో 3184 దరఖాస్తులు వచ్చాయనివెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు సంగమేశ్వర్,సర్పంచ్‌విఠల్‌గురూజీ,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన దరఖా స్తుల స్వీకరణలో అధికారులు పకడ్బందీగా పనులు చేపట్టాలని జడ్పీ సీఈవో సాయగౌడ్ తెలిపారు.మంగళవారం మండలంలోని అన్నారంలో గ్రామపంచాయతీ కార్యక్రమాన్ని జడ్పీ సీఈవో సాయగౌడ్ సంద ర్శించారు. ప్రజా పాలనలో దరఖాస్తులు తీసుకొని వివరాలను జిల్లా అధికా రులకు పం పాలని అధికారులకు ఆదేశించారు.ఆయన వెంటఎంపీడీవో,సర్పంచ్ ఉన్నారు.

తాడ్వాయి: ప్రజాపాలనలో ప్రజలందరికి ఉచితంగానే దరఖాస్తులు లభ్యమ వుతాయని అధికారులు తెలిపారు. మంగళవారం నిర్వహించిన ప్రజాపాలనలో వారు మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తులు ఉచితం గానే దొరుకుతాయన్నారు.తమసమస్యలను దరఖాస్తుఫారంలో పొందు పరిచి అధికా రులకు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ, తహసీల్ధార్, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ:ప్రజాపాలన కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, తహసీల్దార్ సంజయ్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో ప్రజాపాలన గ్రామ సభ నిర్వహించారు. దరఖాస్తు చేసుకునే విధానాలను వివరించారు.

గాంధారి:మండలంలోని తిప్పారం, తిప్పారం తండాలో ప్రజాపాలనలో దరఖాస్తులను ఎంపీడీవో సతీష్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఈనెల 6వ తేది వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటోందని తెలిపారు. ఇబ్బందులు లేకుండా అధికారులే ఫారాలు అందుబాటులో ఉంచుతారని ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండలంలోని మోడిగాం,లింగంపల్లి, బొంపల్లి,జనగాం గ్రామాలలోఎంపీపీ అనసూయ, తహసీల్దార్ హిమబిందు ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. దరఖాస్తుదారులకు ఎక్కడ ఇబ్బంది లేకుండా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేసి దరఖాస్తులు పూరించడంతో పాటు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగిస్తున్నామని తెలిపారు. అక్కడక్కడ దరఖాస్తులు అందడం లేదని ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దని తెలిపారు.మంగళవారం నాలుగు గ్రామాలలో 1111 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్ర మంలో సర్పంచ్‌లు కుంట తిరుమల,చిన్నసాయిలు,శంకర్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీర్కూర్: ప్రజా పాలన అభయ హస్తం దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచామని, ప్రజలు బయట కొనాల్సిన అవసరం లేదని తహసీల్దార్ జనార్ధన్ అన్నారు. మంగళవారం బీర్కూర్ మండలం దామరంచ గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.ఈసందర్భంగా తహసీల్దార్ గ్రామసభలో మాట్లాడారు.దరఖాస్తు ఫారాలు బయట విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీ డీవో భానుప్రకాష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయిని శంకర్, డీసీసీ కార్యదర్శి కొత్తకాపు కాంత్‌రెడ్డి, సొసైటీ ఛైర్మన్ కమలాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తోట నారాయణ, ఎక్బాల్, గంగారాం, బస్వరాజ్, కాశీరాం, బోయిని గంగాధర్, కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: గ్రామంలో నెలకొని ఉన్న భూమి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలం లోని బేగంపూర్ గ్రామస్థులు ప్రజాపాలన సభలో అధి కారులకు దరఖాస్తు అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తమ భూములు బేగంపూర్, కాస్లాబాద్, పెద్ద కొడప్‌గల్ శివారులో ఉన్నాయని ఇవన్నీ ధరణి పోర్టల్‌లో పోడు భూములుగా నమోదు కావడంతో పాటు, మరి కొన్ని భూములకు లాక్ పడిందని, దీంతో తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని వీటిని పరిష్కరించాలని దరఖాస్తులను అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ విషయంలో కలుగజేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

ముఖ్యమంత్రిని కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే


సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావు

మద్నూర్/పెద్దకొడప్‌గల్, జనవరి 2: జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు పత్రిక ప్రకటనలో తెలిపారు. జుక్కల్ నియోజక వర్గం వెనుకబడి ఉందని, ఈ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరానన్నారు. తనకునియోజకవర్గం పట్ల అవగాహన ఉందని, సీఎం సానుకూలంగా స్పందించారని, అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

వైద్య,ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన మాజీ సర్పంచ్


మంత్రికి కలిసిన మాజీ సర్పంచ్

నాగిరెడ్డిపేట,జనవరి2: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహాకు మంగళవారం మండల ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు, నాగిరెడ్డిపేట మాజీసర్పంచ్ విఠల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయన మంత్రిని కలిసి మంత్రికి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినట్లు విఠల్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఎల్లారెడ్డి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయవల సిందిగా మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ సీనియర్‌నాయకుడు


షబ్బీర్‌అలీ ఆధ్వర్యంలోకాంగ్రెస్‌లో చేరుతున్న జూలురి సుధాకర్

కామారెడ్డిటౌన్,జనవరి 2: కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు,జాతీయ సెన్సార్‌బోర్డు మెంబర్ జూలురి సుధాకర్ బీజేపీకి రాజీనామా చేసి మాజీమంత్రి షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరుగ్యారెంటీ పథకాలు అమలుతో పాటు అభివృద్ధి పథంలోకి దూసుకెళ్తున్నందున బీజేపీకి రాజీనామాచేసి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.ఆయనతో పాటు కుర్మ సురేందర్, బొంపల్లి ప్రవీణ్‌లు సైతం పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి,ఉరుదొండ రవి, అంతంపల్లి సుధాకర్‌రెడ్డి, భీంరెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెనరా బ్యాంకు పారితోషకం

గాంధారి,జనవరి 2:జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోతంగల్ కలాన్‌లో 6వ తరగతి నుంచి పదోతరగతి చదువుకుంటున్న ఎస్సీ,ఎస్టీ విద్యార్థినులు దివ్యభావన,నిశిత, సాత్వికలకు రూ.5 వేల చొప్పున కెనరా బ్యాంక్ సంస్థ కార్పొరేట్ ఆఫ్ సోషల్ రెస్పాన్సిబులిటీ నిధుల నుంచి ఉపకార వేతనం మంజూరు అయినట్లు మేనేజర్ సాయినాథ్ తెలిపారు. మంజూరైన ఉపకార వేతనాలను మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రంగారావు, సర్పంచ్ వడ్ల బాలరాజ్ ఆధ్వర్యంలో పంపిణీచేసినట్లు తెలిపారు. పై చదువుల కోసం వాటిని ఉపయోగించుకోవాలని మేనేజర్ సూచించారు. నిరుపేదలకు బ్యాంకు సంస్థలు ఉపకార వేతనాలు మంజూరు చేయడం గొప్పవిషయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ రవి, ఉపాధ్యాయులు లక్ష్మన్‌రాథోడ్, సత్యనారాయణ, ప్రదీప్,గ్రామస్థులు సాయిరాం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పారితోషకం అందిస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో రాములోరి అక్షింతల శోభాయాత్ర

మద్నూర్, జనవరి 2: మండలంలో అయోధ్య రాములోరి దగ్గర ప్రత్యేక పూజలు చేయించుని గ్రామాలకు వచ్చిన అక్షింతలకు భక్తి శ్రద్ధలతో స్వాగతం పలుకుతున్నారు. మంగళవారం అంతాపూర్, పెద్ద శక్కర్గ గ్రామాలలో గ్రామస్థులు,మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ నెల 15 వరకు ఇంటింటికి అక్షింతల వితరణ కార్యక్రమం ఉంటోందని, ప్రతీ ఇంటికి అక్షింతలు అందుతాయని ఆర్ఎస్ఎస్ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు.

పెట్రోల్ బంక్‌ల వద్ద వాహనదారుల భారీ క్యూ

కామారెడ్డిటౌన్,డిసెంబరు 2: కామారెడ్డి జిల్లాలోని అన్ని పెట్రోల్ బంక్‌ల వద్ద మంగళవారం మధ్యాహ్నం నుంచి వాహనదారులు భారీ క్యూకట్టారు.ఇంధన సరాఫరా చేసే ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ల సమ్మెతో పెట్రోల్ కొరత ఏర్పడింది. ఆసమ్మె కొనసాగే అవకాశాలు ఉందని సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో వాహనదారులు ఆందోళన చెంది పెట్రోల్ బంకుల వద్దకు చేరుకున్నారు. దీంతో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు క్యూపెరగడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పలుచోట్ల నిల్వ ఉన్న పెట్రోల్ సైతం అయిపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లి మరి పెట్రోల్,డీజీల్‌ను వాహనదారులు తీసుకోని రావడం గమనార్హం.


కామారెడ్డిలో పెట్రోల్ బంక్‌ల వద్ద భారీగా క్యూకట్టిన వాహనదారులు

నిజాంసాగర్‌లో 13.646 టీఎంసీల నీరు నిల్వ

నిజాంసాగర్,జనవరి 2: నిజాంసాగర్ ప్రాజెక్టులో 17.802 టీఎంసీలకు గాను 13.646 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అలాగే 1405 అడుగులకు గాను 1401.97 అడుగులు సామర్థ్యం కలిగి ఉందని, ప్రధాన కాల్వ ద్వారా 100 క్యూసెక్కులనీటిని విడుదల చేస్తున్నారన్నారు.

దొంగతనం కేసులో ఒకరి అరెస్టు


పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

బీబీపేట,జనవరి2: మండలంలోని యాడారం గ్రామ శివారులో జరిగిన దొంగతనం కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. గతనెల 28న డెయిరీ ఫామ్‌లో జరిగిన దొంగతనం కేసులు కేసునమోదు చేసుకుని విచారణ జరుపుతుండగా మంగళవారం పెద్దమ్మ ఆలయం వద్ద వాహనాలను తనిఖీచేస్తుండగా పర్వతం రాజరత్నం అనుమానస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టామని తెలిపారు. విచారణలో యాడారంలోని డెయిరీ ఫామ్‌లో దొంగతనం చేసింది తనేనని ఒప్పుకున్నాడని దీంతో ఆయనను కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐతెలిపారు.

● పేకాట రాయుళ్ల అరెస్టు

బీబీపేట గ్రామశివారులోని నిర్మానుష్య ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను ఎస్ఐఅనిల్ తన సిబ్బందితో కలిసి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,240 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జేపీ నడ్డాను కలిసిన కామారెడ్డి ఎమ్మెల్యే


ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని అభినందిస్తున్న జేపీనడ్డా

కామారెడ్డిటౌన్, జనవరి 2: అయోధ్య శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 22 అయోధ్యతో పాటు దేశవ్యాప్తంగా జరిగే ఉత్సవాలపై ఢిల్లీలో మంగళవారం జరిగిన సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. సమావేశమనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డిని అభినందించి ఒక పక్క సీఎం అభ్యర్థిని, మరో పక్క సీఎంను ఓడించాడంటూ ప్రశంసలు గుప్పిచాడని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈకార్యక్రమంలో బీజేపీ జాతీయ సంస్థాగత ఇన్‌చార్జి బీఎల్ సంతోష్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాల భైరవస్వామి ఆలయంలో పూజలు



రామారెడ్డి,జనవరి 2: రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి-రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన శ్రీకాల భైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్చారణల మధ్య భైరవునికి క్షీరాభిషేకం, సింధూరపూజలు,అర్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈకార్య క్రమంలో ఆలయ ఈవో ప్రభురాంచంద్రం గుప్తా,జూనియర్ అసిస్టెంట్ సురేందర్‌గుప్తా,మాజీ ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆదేశిస్తే ఎంపీగా పోటీచేస్తా

కామారెడ్డిటౌన్,జనవరి 2: జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా పోటీచేసేందుకు పార్టీ అవకాశం ఇచ్చి ఆదేశిస్తే పోటీచేసి అత్యధిక మెజార్టీతో గెలుస్తానని బీజేపీనాయకుడు డాక్టర్ మురళీధర్‌గౌడ్ అన్నారు.మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా బీజేపీలోనే కొనసాగుతున్నానని రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉండి ఇబ్బందులకు గురిచేసిన ప్రజల పక్షాన పోరాడానని తెలిపారు. పార్టీ తనకు ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇస్తే ఈసారి జహీరాబాద్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలుస్తానని తెలిపారు.ఈ సమావేశంలో నాయకులు చిన్నరాజులు, బాలకిషన్, కడెంశ్రీకాంత్, ప్రదీప్, రమేష్, పేరరమేష్,సురేష్,శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు మురళీధర్‌గౌడ్